పందిల్లలో కలెక్టర్ సందర్శన

పందిల్లలో మదర్‌యూనిట్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్‌రూరల్, జూలై 30 : మండలంలోని పందిల్లలో మంగళవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. గ్రామంలో మాందటి రమాదేవి అనే స్వశక్తి సంఘ మహిళ ఏర్పాటు చేసిన నాటు కోడి పిల్లల పెంపకం మదర్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. నాటు కోళ్ల పెంపకం యూనిట్‌లో కోళ్ల ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సందేహాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ప్రభుత్వ సాయంతో ఇలాంటి యూనిట్లను గ్రామాల్లో ఏర్పాటు చేసి స్వయంశక్తితో ఎదగాలని ఆయన కోరారు.కార్యక్రమంలో డీఆర్డీవో జయదేవ్ ఆర్య, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు కరుణాకర్, వాసుదేవ్, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలి

హుస్నాబాద్, జూలై 30 : ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉందని, దీనిని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను స్థానిక అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణకు ఎంపిక చేసిన మహిళా సంఘం సభ్యులందరికీ ఆగస్టు మొదటివారంలో హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో క్యాంటీన్ల నిర్వహణతో పాటు నాణ్యమైన టిఫిన్స్, భోజనం తక్కువ ధరల్లో అందించే విషయంలో మెళకువలు నేర్పిస్తారన్నారు. ఆర్థికంగా వృద్ధిని సాధించాలని సూచించారు.

మాతా శిశు దవాఖాన భవనం సందర్శన

హుస్నాబాద్ పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో రూ.12కోట్లతో నిర్మాణమైన మాతా శిశుదవాఖాన భవనాన్ని కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. కొత్తగా నిర్మించిన ఈ భవనంలో ఇంకా కావాల్సిన సౌకర్యాలు, పనుల పురోగతిపై కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. దవాఖాన కోసం ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, నీటి వసతి కోసం చర్యలు చేపట్టాలని అధికారులను అదేశించారు. ఆయనవెంట ఆర్డీవో రామ్మూర్తి, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా రుణమాఫీ.. : కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, జూలై30: సిద్దిపేట జిల్లాలో 0 నుంచి 1.50 లక్షల లోపు పంట రుణమాఫీ జరిగినట్లు జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 2 లక్షల రూపాయల లోపు రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముఖ్యమంత్రి లక్ష నుంచి రూ. 1.50 లక్ష వరకు రైతు రుణమాఫీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో ప్రాజెక్టర్ ద్వారా ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు, రైతులతో కలిసి కలెక్టర్ వీక్షించారు. ఈ సందర్భంగా రైతు కుటుంబాలు పొందిన రైతు రుణమాఫీ చెక్ పోస్ట్‌ర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 279 కోట్ల33 లక్షల 31968 రైతు రుణమాఫీని 27955 రైతు కుటుంబాలకు అందజేశామన్నారు. రుణమాఫీ ప్రక్రియ సాఫీగా జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి అందుబాటులో ఉంటారని వారిని సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని రైతులకు సూసించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ప్రభాకర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరి, వ్యవసాయ సహకార వాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి పేరిట భూమి స్వాహా

కేశవాపూర్ రామలింగేశ్వరస్వామి గుట్టపై ఘటన

కేశవాపూర్‌లోని రామలింగేశ్వర స్వామి గుట్టపై వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం

అక్కన్నపేట, జూలై 30 : మండలంలోని కేశవాపూర్ పరిధిలోని రామలింగేశ్వరస్వామి గుట్టపై వీరబ్రహ్మేంద్ర స్వామి పేరిట భూమిని అదే గ్రామానికి చెందిన కందారపు రమేశచార్యులు స్వాహా చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధ్యాత్మికం పేరిట అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ పబ్బం గడుపుకొంటున్న రమేశచార్యులు పూజా కార్యక్రమాల పేరిట వసూళ్ల దందా పాల్పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. గతంలో పలు అవినీతి, అక్రమాలు ఎదుర్కొంటున్న రమేశచార్యులు తాజాగా కుల దైవం వీరబ్రహ్మేంద్ర స్వామి పేరిట కార్యకలాపాలు సాగిస్తున్నారు. అక్కన్నపేట తహసీల్దార్ సంజీవ్ కుమార్ హయాంలో దేవుడి పేరి రామలింగేశ్వర స్వామి గుట్టపై 20 గుంటల భూమిని కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడనీ, తానే గుడికి వ్యవస్థాపకుడికినని పేర్కొన్నారు. దీంతో నమ్మిన రెవెన్యూ అధికారులు రమేశచార్యుల పేరిట 20 గుంటల భూమిని పట్టా చేసినట్లు సమాచారం తెలిసింది. కాగా, ఈ విషయంపై తహసీల్దార్ అనంతర్‌రెడ్డి వివరణ కోరగా, తాను ఇటీవల విధుల్లో చేరాననీ, ఆ భూముల విషయంలో విచారణ చేపడుతామని పేర్కొన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రమేశ చార్యులు వివరణ కోర గా, తాను వీరబ్రహ్మేంద్ర స్వామి పేరిట భూమిని పట్టా చేయాలని కోరిన విషయం నిజమేనన్నారు. అందుకు దరఖాస్తు కూడా చేశానని, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు విచారణ చేపడితే చట్టపర చర్యలకు తాము సిద్ధమని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చంటికి పరామర్శ..

చేర్యాలలో బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంటిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, జూలై 30 : బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి తల్లి ఇటీవల మృతి చెందింది. మంగళవారం గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, కొండపాక మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, గజ్వేల్ మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, చేర్యాల ప్రాంత యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య తదితరులు చంటితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

శ్రీనివాస్‌కు పరామర్శ

గజ్వేల్, జూలై 30 : మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్ తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మంగళవారం మండల పరిధిలోని దాచారంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చీకోడు మాజీ సర్పంచ్‌కు ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ

దుబ్బాక, జూలై 30 : దుబ్బాక మండలం చీకోడు మాజీ సర్పంచ్ తౌడ శ్రీనివాస్ తల్లి ఇటీవల మృతిచెందగా, విషయం తెలుసుకున్న ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బనాల శ్రీనివాస్, జెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

అత్తపై దాడికి పాల్పడిన అల్లుడు అరెస్టు

కొమురవెల్లి, జూలై 30 : కొమురవెల్లి మండల కేంద్రంలో మల్లన్న ఆలయ సమీపంలో బొమ్మల దుకాణం నిర్వహిస్తున్న పాతకోటి చంద్రకళపై పెద్దకుతూరు మౌనిక భర్త చల్లా ఎల్లారెడ్డి కత్తితో దాడి చేసి పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తొగుట జూలై 30 : అనారోగ్యంతో ఆకస్మికంగా మృతిచెందిన మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన కేసు బాలరాజు కుటుంబానికి అండగా ఉంటామని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి భరోసా ఇచ్చారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబీకులను పరామర్శించారు. రూ.2500 ఆర్థిక సాయం అందించి, రైతు బీమా ద్వారా రూ.5 లక్షల సాయం అందుతుందన్నారు. పరామర్శించిన వారిలో గ్రామ అధ్యక్షుడు పులిగారి శివయ్య, సూతారి రాములు, కంకణాల స్వామి, క్యాస శివకొటి, ఎంగిలి రాములు, లక్ష్మణ్, బెజ్జనబోయిన కనకరాజు, మండల నాయకుడు సూతారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలి

త్రిబుల్ ఐటీ సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఎంఈవో, పాఠశాల ఉపాధ్యాయులు

ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

దుబ్బాక,జూలై 30 : రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి కోరారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ఉచిత పథకాలతో పేదరిక నిర్మూలన సాధ్యం కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థులకు అభినందన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరయ్యా రు. పోతారెడ్డిపేట పాఠశాలలో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 17 మంది విద్యార్థులకు బాసరా ట్రిపుల్ ఐటీలో సీటు రావడం, ఇందులో నాలుగురు విద్యార్థులకు 10 జీపీఏ రావడంపై ఎమ్మెల్సీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక, కొండపాక ఎంఈవోలు ప్రభుదాస్, శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

జగదేవ్‌పూర్, జూలై 30 : మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన మంజే జహంగీర్‌కు మంగళవారం మాజీ గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి మంజూరైన రూ.19500 సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేశారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు మధు, భాస్కర్, రామ్‌రెడ్డి, గణేశ్ తదితరులు ఉన్నారు.

కుకునూరుపల్లిలో..

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 30 : కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన కర్నాల నవీన్, కోల సందీప్ అనారోగ్యానికి గురైన దవఖానలో చికిత్స పొందగా వారి ఆర్థిక పరిస్థితిని ఎన్ఆర్‌జీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణారవీందర్ నాటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తెసుకువెళ్లారు. కర్నాల నవీన్‌కు రూ.56, 500, కోల సందీప్‌కు రూ.22,550 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం బాధితుకుల అందజేశారు.

ఎల్వోసీ చెక్కు అందజేత

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), జూలై 30 : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లిలో ఆతికం రాజు అనారోగ్యంతో బాధపడుతున్నారు. రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మ న్ బక్కి వెంకటయ్య మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం మోతెలో మాజీ ఉప సర్పంచ్ గుంటి రమేశ్ తల్లి గుంటి నర్సవ్వ ఇటీవల మృతి చెందగా, పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవి, నాయకులు శ్రీనివాస్,నాయకులు రాజేశ్వర్, నర్సింహులు, రాజిరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి): సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

పల్లెలు కన్నీళ్లు పెడుతున్నాయి..

అసెంబ్లీలో ధ్వజమెత్తిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జూలై 30 : కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెలు కన్నీరు పెడుతున్నాయని, నిధులు లేక గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందని మంగళవారం శాసనసభలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం అసెంబ్లీలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రసంగించే అవకాశం రావడంతో నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై వివరించారు. 8 నెలలుగా ఒక్క కొబ్బరికాయ కొట్టింది లేదు.., ఒక శిలాఫలకం పెట్టింది లేదన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గ అభివృద్ధి (సీడీపీవో) నిధులు ఊసే లేదు. ఇదిలా ఉంటే దుబ్బాక నియోజకవర్గానికి బీఆర్ఎస్ సర్కారు మంజూరు చేసిన సూమారు రూ.80 కోట్ల నిధులు వెనక్కి తీసుకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గ్రామాల్లో కుక్కల బెడద, పెరిగిన పిచ్చి మొక్కలు, క్రిమికీటకాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

'యునానీ' వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), జూలై30: మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న 'యునానీ' దవఖాన యొక్క వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నజీయా అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితం నుంచి మద్దూరులో ఈ యునానీ దవాఖాన కొనసాగుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు యునాని మందులు చాలా చక్కగా పనిచేస్తాయన్నారు. త్వరలోనే గ్రామాల్లో యునానీ దవాఖాన ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

చేర్యాల, జూలై 30 : ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ కోరారు. పట్టణంలో మంగళవారం హలో మాదిగ చలో ఢిల్లీ కరపత్రాలను రాజేందర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ మాట తప్పాడన్నారు. మాదిగలకు పెద్దన్న పాత్ర పోషిస్తానని హామీ ఇచ్చిన ప్రధాని వెంటనే బిల్లు పెట్టి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వంగపల్లి శ్రీనివాస్ మహాదీక్ష చేపట్టినట్లు దీక్షకు జిల్లాల నుంచి మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు టౌన్ అధ్యక్షుడు చుంచు నర్సింగరావు, నాయకులు భూమిగారి దామోదర్, చంచు తిరుపతి, పాకాల అనిల్, నాగేశ్, సంజీవులు, నర్సింహులు, నవీన్, రవితేజ, సంజయ్ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు రాజేందర్

ఎల్లప్పుడు అండగా ఉంటాం..

రాయపోల్ జూలై 30 : 30 ఏండ్ల నుంచి కార్యకర్తగా పనిచేస్తూ దౌల్తాబాద్ మండలం శేరుపల్లి బందారం గ్రామానికి చెందిన జోడు శ్రీశైలం గుండెపోటుతో మృతి చెందడం ఎంతో బాధాకరమని మాజీ ఎమ్మె ల్సీ ఫరూఖ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం శేరుపల్లి బందారంలో మృతిదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు సయ్యద్ రహీం. నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి మండల బీఆర్ఎస్ నాయకులు దారా సత్యనారాయణ, చింత కింది మంజూర్, మండల నాయకులు జనార్ద న్‌రెడ్డి, గాజులపల్లి స్వామి ఉన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్

ఉద్యోగులకు బదిలీలు సహజం

చేర్యాల, జూలై 30 : ఉద్యోగుల బదిలీలు సహజమని, ఎక్కడికి వెళ్లినా బాధ్యతగా విధులు నిర్వహించాలని కడవేర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బల్ల శ్రీనివాస్ అన్నారు. గ్రామ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లి ఉపాధ్యాయులతో పాటు బదిలీపై, ప్రమోషన్లపై పాఠశాలలో చేరిన వారికి మంగళవారం సన్మానం నిర్వహించారు. తాడూరు గ్రామ పంచాయతీలో 5 ఏండ్ల పాటు పంచాయతీ కార్యదర్శిగా పని చేసి బదిలీపై వెళ్తున్న బత్తుల సురేశ్, పంచాయతీ కార్యదర్శిగా పని చేసేందుకు వచ్చిన కొయ్యడ సందీప్ పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. దానంపల్లి గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పని చేసి బదిలీపై వెళ్తున్న కార్యదర్శి రాజును సన్మానించారు.

ముదిరాజ్‌లను బీసీ-'ఏ'కు మార్చాలి

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 30 : ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-లోకి మార్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మద్దూరు, ధూళిమిట్ట మండలాల తహసీల్దార్లకు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొమువెల్లి ఆలయ మాజీ చైర్మన్ గీస భిక్షపతి ముదిరాజ్ వినతి పత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరిసాగర్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి యాట యాదగిరి, చేర్యాల మాజీ ఎంపీపీ కరుణాకర్ స్థానిక నాయకులతో కలిసి మాట్లాడుతూ 50 ఏండ్లు నిండిన మత్స్యకారులకు ఆసరా ఫించన్ అందించాలన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలన్నారు. రాజకీయాలలో ముదిరాజ్‌ల ప్రాతినిధ్యం పెంచడానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలన్నారు. సంఘం అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి, జూలై 30 : ఎన్నికల ముందు ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముదిరాజ్ సంఘం కొమురవెల్లి మండలాధ్యక్షుడు గొల్లపల్లి కిష్టయ్య అన్నారు. మంగళవారం ఎన్నికల ముందు ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గీప భిక్షపతి, ముదిరాజ్ సంఘం నాయకులు మేడికుంట శ్రీనివాస్, బాలయ్య, సార్ల కిష్టయ్య, గొల్లపల్లి ఆంజనేయులు, సార్ల(గట్కు)మల్లయ్య, కౌలుబాయి ఆంజనేయులు, యాదగిరి, స్వామి, హరికృష్ణ, మల్లేశం పాల్గొన్నారు.

కుదిరిన ఒప్పందం

ములుగు, జూలై 30 : ఉద్యాన విశ్వవిద్యాలయం, నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సంస్థ మధ్య పరస్పర సహకారానికి అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. మండల కేంద్రం ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మంగళవారం వీసీ డాక్టర్ నీరజా ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, పరిశోధన సంచాలకులు కిరణ్ కుమార్, డీన్ రాజశేఖర్, ఇతర అధికారులు ఉన్నారు.

ఒప్పంద పత్రాలను చూపుతున్న ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ నీరజా ప్రభాకర్

బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడికి మాతృవియోగం

చేర్యాల, జూలై 30 : మండలంలోని వీరన్నపేట మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీనివాస్‌కు మాతృవియోగం కలిగింది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్ తల్లి సాయమ్మ (60) మంగళవారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారలున్నారు. శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాలు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

సామాజిక చైతన్య దీక్షల కరపత్రాల ఆవిష్కరణ

చేర్యాల, జూలై 30 : జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ఆగస్టు 7,8,9వ తేదీల్లో ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్‌లో నిర్వహించే సామాజిక చైతన్య దీక్షలకు సంబంధించిన కరపత్రాలను జాతీయ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహ ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మాల, మహార్ అనుబంధ కులాల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం, దళితుల విభజన ప్రయత్నాలు మానుకోవాలన్నారు. న్యాయస్థానాల్లో రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల చట్టం తీసుకురావాలన్నారు.15 డిమాండ్లతో పార్లమెంట్ స్ట్రీట్‌లో చైతన్య దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు మేడిపల్లి నరసింహ, బుట్టి ఆగమల్లు, పుట్ట యాదయ్య, శ్రీరాం మల్లయ్య, విజయ్‌కుమార్, చంద శ్రీకాంత్, గుస్క గోవర్ధన్, పుట్ట అయిలయ్య, అనిల్, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలు ఉద్యమించాలి

సిద్దిపేట, జూలై 30: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో గల ఎన్డీఏ ప్రభుత్వం తన విధానాలను మార్చుకొని ప్రజలకు అనుకూలంగా పరిపాలన సాగించాలని, పేదలపై భారాలు వేసే విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించి ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. మంగళవారం రోజున సిద్దిపేటలో సీపీఎం జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన చుక్క రాములు మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామునిగోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శ్వేట్టిపల్లి సత్తిరెడ్డి,గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, బద్దిపడగ కృష్ణారెడ్డి, అమ్ముల బాల నర్సయ్య, తిప్పారపు శ్రీనివాస్,అత్తిని శారద, దాసరి ప్రశాంత్, సింగిరెడ్డి నవీన, జాలిగపు శిరీష, తాడూరి రవీందర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

జగదేవ్‌పూర్,జూలై 30 : రాష్ట్రంలో సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అందించి రెగ్యులరైజ్ చేయాలని అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. మంగళవారం మండలం నుంచి పలువురు ఎస్ఎస్ఏ ఉద్యోగులు అసెంబ్లీ ముట్టడిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు దయానంద్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని, చెప్పి 8నెలలు గడుస్తున్నా తమను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే తమకు న్యాయం చేస్తామని చెప్పి నేడు తమను గుర్తించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. సీఆర్పీ రమణ, పీటీఐ నరేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 30 : బైక్ అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరో ఇరువురికి స్వల్పగాయాలైన సంఘటన మంగళవారం కొండపాక మండలంలోని దుద్దెడలో చోటు చేసుకుంది. ప్రత్యేక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మారం మండలంలోని రాజంపల్లికి చెందిన సమన్, లక్ష్మణ్, కాంత్రి ముగ్గురు స్నేహితులు బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో దుద్దెడ మూలమలుపు వద్ద అతివేగంగా వచ